సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

హామీలను మరిచిన బీజేపీ

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

భువనగిరి అర్బన్, మార్చి 26: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను పూర్తిగా మర్చి పోయిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మంగళవారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్య, వైద్యం, మహిళాభ్యున్నతి వంటి వాటిని పక్కన బెట్టి అవినీతి, కులమతాల మధ్య చిచ్చు పెట్టడం, మహిళలపై దాడులు, హత్యలు, లైంగిక దాడులను ప్రోత్సహిస్తున్నదన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన కుంభకోణాల కంటే బీజేపీ ఎక్కువ చేసిందన్నారు. ఎన్నికల బాండ్ల పేరుతో రూ.16వేల కోట్లు వస్తే అందులో బీజేపీకి రూ.8వేల కోట్లు ముట్టాయని, కాంగ్రెస్ పార్టీకీ రూ.2 వేల కోట్లు అందాయని చెప్పారు. ఎన్నికల బాండ్లను గతంలోనే సీపీఎం వ్యతిరేకించిందన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగాన్ని మార్చి ఆ స్థానంలో మనుధర్మాన్ని తిసుకొచ్చి ఫ్యూడల్ పద్ధతులు ప్రవేశపెట్టడం కోసం ప్రయత్నం చేస్తున్నదన్నారు. ఇప్పటికే సీఏఏ, జ్యోతిష్య శాస్త్రం అమలు, విద్యా కాషాయీకరణ చేపట్టిందని, దీనిని వ్యతిరేకించిన ప్రతిపక్షాలపై ఈడీ, సీబీఐ సంస్థలను ప్రయోగిస్తూ బెదిరింపులకు పాల్పడుతుందని పేర్కొన్నారు. పార్టీలు మారడం నాయకులకు ఫ్యాషనైపోయిందన్నారు. ప్రస్తుతం ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఓడిపోయిన పార్టీల నాయకులు అందులో చేరుతున్నారని, తమ ఆస్తులు, వ్యాపారాలను కాపాడుకోవడానికే వారు ఇలా చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం కరువు కారణంగా పంట పొలాలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు వాటిని పరిశీలించిన పాపాన పోలేదని, కనీసం రైతు గోడును వినిపించుకునే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతుకు పరిహారాన్ని చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఎంపీ అభ్యర్థిగా ఎండీ.జహంగీర్‌ను ఎన్నికల బరిలో నిలుపుతున్నట్లు చెప్పారు. సమావేశంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ.జహంగీర్, నాయకుడు కొండమడుగు నర్సింహ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ మంగమ్మ, నాయకులు

ధర్మభిక్షం సేవలు మరువలేనివి

రామన్నపేట, మార్చి 26 : ధర్మభిక్షం సేవలు మరువలేనివని సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ ధర్మ భిక్షం 13వ వర్ధంతిని మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో నాయకులు గంగాపురం వెంకటయ్య, మల్లయ్య, ముత్తయ్య, లగ్గోని యాదయ్య, భూపతి నర్సింహ, చెరుకు శివరాజ్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని గౌడసంఘం కార్యాలయంలో ధర్మభిక్షం చిత్రపటానికి ఎంపీపీ తండా మంగమ్మాశ్రీశైలంగౌడ్ పూలమాల వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో గీతపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పంజాల నర్సయ్య గౌడ్, గౌడసంఘం మండలాధ్యక్షుడు రంగ సత్యనారాయణ, నాయకులు దశరథగౌడ్, వెంకన్న, రాజు, స్వామి, కృష్ణమూర్తి, ఐలయ్య మల్లేశ్, శేఖర్, నవీన్ పాల్గొన్నారు.

మోత్కూరు : పట్టణంలోని కేఆర్ భవనంలో బొమ్మగాని ధర్మభిక్షం చిత్ర పటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు చేడె చంద్రయ్య, గీత పనివారల సంఘం అధ్యక్షుడు చాపల అంజయ్య, పార్టీ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, నాయకులు మల్లేశ్, గౌలుసుల యాదగిరి, అన్నెపు కిష్టయ్య, మల్లెబోయిన బుచ్చయ్య, ఎండీ అబ్బాస్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలో మాజీ ఎంపీ ధర్మభిక్షం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా కార్యదర్శి కొయ్యడ నరసింహగౌడ్, మండల అధ్యక్షుడు గునిగంటి మల్లేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు తండా వెంకటేశ్, నాయకులు ముప్పిడి శ్రీనివాస్, బొడిగే లింగం, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

వలిగొండ : దాసిరెడ్డిగూడెంలో సాంబశివుడి స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు

సాంబశివుడికి నివాళి

భువనగిరి అర్బన్, మార్చి 26 : విప్లవ వీరుడు కొనపురి సాంబశివుడి 13వ వర్ధంతిని మంగళవారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివుడి చిత్రపటానికి సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట విరేశ్‌యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుండబోయిన సురేశ్‌యాదవ్, జిల్లా కో-ఆర్డినేటర్ అవిశెట్టి రమేశ్‌యాదవ్, రేకలా రమేశ్‌యాదవ్, పట్టణాధ్యక్షుడు మర్రి పాండుయాదవ్, కుర్మ సంఘం నాయకులు ర్యాకల శ్రీనివాస్, నరాల రాజుయాదవ్, గుండబోయిన నర్సింహ, చుక్కల శంకర్, బాత్క అశోక్, శ్రీరామ్ శరత్, రసాల లింగస్వామి, మల్లేశ్ పాల్గొన్నారు.

దాసిరెడ్డిగూడెంలో..

వలిగొండ : మండలంలోని దాసిరెడ్డిగూడెంలో సాంబశివుడి స్మారక స్థూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, నాయకులు పనుమటి మమతా నరేందర్‌రెడ్డి, కొమిరెల్లి సంజీవరెడ్డి, డేగల పాండరి, మాద శంకర్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, అయోధ్య యాదవ్, కునపూరి స్వర్ణలత, నారి మల్లేశం, శ్రీశైలం, కాసాని వెంకటేశ్, దంతూరి నరేశ్, మల్లారెడ్డి, వీరస్వామి, సాయి, రామకృష్ణ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కుర్మ సంఘం కమిటీ ఎన్నిక

రాజాపేట, మార్చి 26 : మండలంలోని పారుపల్లిలో మంగళవారం కుర్మ సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జూకంటి రాములు, ఉపాధ్యక్షుడిగా మోటె బాలమల్లేశం ఎన్నికైనట్లు అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వస్పరి సుధాకర్, కో కన్వీనర్ గౌర బక్కయ్య తెలిపారు.

శిలాఫలకం ధ్వంసం

మునుగోడు, మార్చి 26 : మండలంలోని ఊకొండి నుంచి తాళ్లవెల్లంలకు వెళ్లే దారిలో 6 నెలల క్రితం మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.1.26కోట్లతో ఊకొండి నుంచి తాళ్లవెల్లంల శివారు వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కొందరు ఆకతాయిలు శిలాఫలకాన్ని ధ్వంసం చేసి ఉంటారని బీఆర్‌ఎస్ నాయకులు అనుమానిస్తున్నారు.

గంధమల్ల రిజర్వాయర్‌తో ఆలేరు సస్యశ్యామలం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, మార్చి 26 : తపాసుపల్లి జలాశయం నుంచి గోదావరి జలాలు తీసుకు రావడంతోపాటు గంధమల్ల రిజర్వాయర్ నిర్మించడం ద్వారా ఆలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం భువనగిరి పట్టణంలోని దీప్తిహోటల్లో 'వందరోజుల పాలన– వంద ప్రశ్నలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రాబోయే రోజుల్లో సాగు, తాగు నీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వారం రోజుల్లో యాదగిరిగుట్ట దేవస్థాన ఉద్యోగులతో సమీక్ష జరిపి, బదిలీలు చేపడతామని పేర్కొన్నారు. శ్రీవారి మెట్ల మార్గంపై కప్పు వేసి భక్తులు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. మెట్ల మార్గంలో షాపులకు అనుమతిస్తామన్నారు. అంజనాద్రి కాలనీలో రోడ్డు బాధితులందరికీ ఇండ్ల స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఇసుక అక్రమ రవాణా పూర్తిగా అరికడతామని, మల్లాపురంలోనే ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్మిస్తామని చెప్పారు. ఆలేరులో బీడీ కార్మికుల కోసం ఆస్పత్రిని నెలకొల్పుతామన్నారు. ఆలేరు పెద్ద వాగుపై ఉన్న బ్రిడ్జిని వెడల్పు చేసి డబుల్‌రోడ్డుగా మారుస్తాని పేర్కొన్నారు. గుండాల మండలం రాచకొండ కమిషనరేట్ బదలాయింపు ప్రక్రియ త్వరలో పూర్తి చేస్తామని, కొత్తగా ఏర్పాటైన మోటకొండూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తామని తెలిపారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, ఎంపీపీలు చీర శ్రీశైలం, గంధమల్ల అశోక్, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గిరిగౌడ్, నాయకులు ఉపేందర్‌రెడ్డి, గూడ మధుసూధన్‌రెడ్డి, కానుగు బాలరాజు, నరేందర్‌గుప్త పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు

- కలెక్టర్ హనుమంతు కె. జెండగే
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో వీడియో కాన్ఫరెన్స్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే, అధికారులు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 26 : రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి ఇబ్బందులు కలుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఏప్రిల్ ఒకటో తేదీన ప్రతి మండలంలో ఒక కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని, మిగతా కేంద్రాలను సత్వరమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రానున్నదని, 323 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని తెలిపారు. జిల్లాలో 720 ఆవాసాలు ఉన్నాయని, అర్బన్, గ్రామాలలో పనిచేయని బోర్లను గుర్తించి మరమ్మతు పనులు చేపట్టినట్లు చెప్పారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు కలుగకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో నిత్యం పర్యవేక్షిస్తున్నామని, పూర్తి కార్యాచరణ ప్రణాళికతో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు సిద్ధంగా ఉండాలని, మున్సిపాలిటీలోని చివరి వార్డుకు కూడా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం గోపీకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ, మిషన్ భగీరథ డీఈ కరుణాకర్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

చౌటుప్పల్, మార్చి 26 : మహిళ మెడలోంచి బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాచకొండ పుష్పమ్మ(70) రాత్రి తన వద్ద నిలబడి ఉండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె కొడుకు గిరి గురించి వాకబు చేశాడు. తన కొడుకు చౌటుప్పల్ షాపు వద్ద ఉన్నాడని పుష్పమ్మ చెప్పింది. దాంతో సదరు వ్యక్తి ఇంటి చుట్టుపక్కల పరిశీలిస్తుండగా .. అతడిని అనుమానించిన పుష్పమ్మ ఏంది అలా చూస్తున్నావని నిలదీసింది. అంతలోనే సదరు వ్యక్తి ఒక్కసారిగా ఆమె వద్దకు వచ్చి మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని బైక్‌పై పారిపోయాడు. పుష్పమ్మ అరుపులకు పక్కింటి వారు వచ్చి అతడిని వెంబడించినా ఫలితం లేకుండా పోయింది. రాచకొండ పుష్పమ్మ ఫిర్యాదు మేరకు చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ దర్శకుడు శేఖర్‌సూరి

'ఆవిష్కర్త' సినిమా పోస్టర్ విడుదల

భూదాన్‌పోచంపల్లి, మార్చి 26 : అవని క్రియేషన్స్ బ్యానర్‌పై సినిమా భూదాన్ పోచంపల్లికి చెందిన డైరెక్టర్ భోగ ప్రవీణ్‌కుమార్ నిర్మిస్తున్న ఆవిష్కర్త సినిమా పోస్టర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో ప్రముఖ సినీ దర్శకుడు శేఖర్‌సూరి ఆవిష్కరించారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మొదటి పాటను విడుదల చేస్తామని డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో చిత్ర నిర్మాత రుద్ర నవీన, కెమెరామెన్ సురపల్లి ఉపేంద్ర, మ్యూజిక్ డైరెక్టర్ కురాకుల విజయ్, నటీనటులు నూకల రామ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 11న ఆత్మజ్ఞాన సదస్సు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 26 : మండల కేంద్రంలోని మార్కండేశ్వర స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక భక్త సమాజం ఆధ్వర్యంలో ఏప్రిల్ 11,12,13 తేదీల్లో ఆధ్యాత్మిక జ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు ఆధ్యాత్మిక సమాజం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భారత పురుషోత్తం, చక్రాల నరసింహ, ప్రధాన కార్యదర్శి నోముల అశోక్ తెలిపారు. మంగళవారం స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమానికి కృష్ణా జిల్లా పెనమలూరులోని పరమాత్మానంద ఆశ్రమ పీఠాధిపతులు ప్రకాశానంద సరస్వతి, కర్నూలు జిల్లా కామవరం అమ్మ ఒడి ఆశ్రమానికి చెందిన అనంతానందగిరి స్వామి హాజరు కానున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు రుద్ర శ్రీశైలం, కటకం తుకారాం, దోర్నాల కృష్ణమూర్తి పంతులు, మేకల నరేందర్, చంద్రయ్య పాల్గొన్నారు.

సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

మోత్కూరు, మార్చి 26 : మున్సిపల్ కేంద్రానికి చెందిన కోట రాజు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పేద కుటుంబానికి చెందిన రాజుకు వైద్యం కోసం మోత్కూరు వాట్సాప్ గ్రూప్ ఆధ్వర్యంలో సేకరించిన రూ.46 వేలను మంగళవారం గ్రూప్ సభ్యులు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ అందించారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు దబ్బేటి సొంబాబు, గంధం శ్రీనివాస్‌రావు, కారుపోతుల వెంకన్న, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, గనగాని నర్సయ్య, జంపాల రాజు, ముప్ప వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మోత్కూరు : రాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, దాతలు

పేద కుటుంబానికి బీఆర్‌ఎస్ అండ

సంస్థాన్‌నారాయణపురం, మార్చి 26 : మండలంలోని సర్వేల్ గ్రామానికి చెందిన మహేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడిది నిరుపేద కుటుంబం కావడంతో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామశాఖ నాయకులు మంగళవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. 100 కేజీల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్టెల భిక్షపతి, నలపరాజు స్వామి, నాయకులు రమేశ్, జగన్‌రెడ్డి, నర్సింహ, నాగర్జున, జంగయ్య గౌడ్, మల్లేశ్, పెంటయ్య పాల్గొన్నారు.

ఏటీఎంలో దొరికిన డబ్బు పోలీసులకు అప్పగింత

కట్ట కుమార్‌కు డబ్బులను అందజేస్తున్న ఎస్‌ఐ మల్లయ్య

రామన్నపేట, మార్చి 26: తనకు ఏటీఎంలో దొరికిన డబ్బులను పోలీసులకు అప్పగించి మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన అవనగంటి మహేశ్ నిజాయితీ చాటుకున్నాడు. ఎస్‌ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం మండల కేంద్రంలోని కెనరాబ్యాంక్ ఏటీఎంలో డబ్బులు డ్రా చేసేందుకు అవనగంటి మహేశ్ వెళ్లాడు. అంతకు ముందే డ్రా చేసిన రూ. 9వేలు ఎవరో మర్చి పోవడంతో వాటిని తీసుకెళ్లి పోలీసులకు అప్పచెప్పాడు. అయితే నీర్నెంముల గ్రామానికి చెందిన కట్ట కుమార్ డబ్బులు విత్‌డ్రా చేసి మర్చి పోగా.. వాటి కోసం తిరిగి ఏటీఎం వద్దకు వచ్చాడు. అప్పటికే సదరు డబ్బులను మహేశ్ పోలీసులకు అప్పగించినట్లు తెలుసుకొని పోలీసులను సంప్రదించాడు. ఎస్‌ఐ మల్లయ్య డబ్బులను కట్ట కుమార్‌కు అందించారు. డబ్బులను పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్న అవనగంటి మహేశ్‌ను ఎస్‌ఐ, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్ అభినందించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- అదనపు కలెక్టర్ గంగాధర్

సర్వేపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్

ఆత్మకూరు(ఎం), మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్ ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు సర్వేపల్లి, రాయిపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. ప్రతి నర్సరీలో అన్ని రకాల మొక్కలను పెంచాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ మల్లికార్జున్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు ఉన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

- రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ వీరప్ప

రైతులు సాగు చేసిన పంటచేలను పరిశీలిస్తున్న ఏడీఏ వీరప్ప

భూదాన్‌పోచంపల్లి, మార్చి 26 : రైతులు సాగులో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని నల్లగొండ జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ ఎం.వీరప్ప సూచించారు. మంగళవారం మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతుల సందేహాలకు సమాధానాలిచ్చారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో రైతుల పొలాలను పరిశీలించారు. రైతులు సమగ్ర వ్యవసాయ విధానాలు ఆచరిస్తూ ఆదాయం రెట్టింపు చేసే పంటలు సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎండీ ఎజాజ్ అలీ ఖాన్, ఏఈఓలు సోనీ, శిరీష, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో నిర్వహించిన సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 26 : మండల కేంద్రంలోని లక్ష్మీ నారాయణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయంలో ఆరాధన, బలిహరణం, నివేదన హారతి, తీర్థ ప్రసాద వినియోగం, పొన్నసేవ నివేదన చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంకం వినోద్, కౌన్సిలర్లు మోటే రజితారాజు, కుడికాల అఖిలాబలరాం, దేవరాయ కుమార్, ధర్మకర్తలు మోటి మహేశ్, చేరాల సుధీర్, వేషాల మురళి, కూరపాటి బాబు, గునిగంటి సుభాశ్, సకినాల నాగయ్య, ముత్యాలు, బాలాజీ, రాములు, పొన్న మౌనిక, ధర్మకర్తలు పాల్గొన్నారు.

అడుగంటిన పిన్ చెరువు

నీళ్లు లేక అడుగంటిన కొలనుపాక పిన్ చెరువు

ఆలేరు రూరల్, మార్చి 26 : వేసవి ప్రారంభంలోనే చెరువులు ఎండి పోతుండడంతో గ్రామా ల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. గతేడాది మేలో కూడా నీటితో కళకల్లాడిన మండలంలోని కొలనుపాక పిన్ చెరువు ప్రస్తుతం పూర్తిస్థాయిలో అడుగంటింది. చెరువులో నీరు లేక పోవడంతో గ్రామంలోని బోర్లు సైతం పూర్తిగా ఒట్టి పోయాయి. బోర్ల కింద సాగు చేసిన పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రానున్న రోజుల్లో కనీసం పశు, పక్షాదులకు సైతం తాగునీరు లభించని పరిస్థితి నెలకొంది.

బీసీ ఉపకులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి

- శక్తి మిషన్ అధ్యక్షుడు శ్రీనివాస్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 26 : రాష్ట్రంలోని బీసీ ఉపకులాలన్నింటికి ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని శక్తి మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కర్తాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రెడ్డిల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రెడ్డి కార్పొరేషన్ మాదిరిగానే బీసీలకు కూడా ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలన్నారు.

మోత్కూరు మహిళకు డాక్టరేట్


కల్వల మాధవి

మోత్కూరు, మార్చి 26 : మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన కల్వల మాధవి కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. రాష్ట్ర అభివృద్ధిలో నీటి పారుదల ప్రాజెక్టుల ప్రాధాన్యం అనే అంశంపై ఆమె కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర రిటైర్డ్ ఆధ్యాపకుడు సంజీవరెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. మమత ప్రస్తుతం హన్మకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు.

గన్నీ బ్యాగులు దగ్ధం

దగ్ధమైన గన్నీ బ్యాగులు

భూదాన్‌పోచంపల్లి , మార్చి 26 : మండలంలోని జూలూరు పీఏసీఎస్‌కు చెందిన మార్కెట్‌షెడ్‌లో నిల్వ ఉంచిన గన్నీ బ్యాగులు సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. జూలూరు పీఏసీఎస్‌కు చెందిన 7వేల గన్నీ బ్యాగులను ధాన్యం మార్కెట్‌లోని షెడ్డులో నిల్వ ఉంచారు. సోమవారం రాత్రి వాటికి ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో పూర్తిగా కాలిపోయాయి. రాత్రి వేళ కావడంతో షెడ్డులో చెలరేగిన మంటలను గ్రామస్తులు గమనించలేదు. తెల్లవారు జామున ఒకరు గమనించి పీఏసీఎస్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్‌తో మంటలను ఆర్పివేశారు. అప్పటికే బస్తాలు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ. 3లక్షల నష్టం వాటిల్లినట్లు సిబ్బంది తెలిపారు.